# 2. రెండు సూచనలు

ఓ గురువు దగ్గరకి ఓ సాధకుడు వెళ్ళి ఆయనకి వినయంగా సాష్టాంగ నమస్కారం చేసి అడిగాడు.

"స్వామి! నేను ఆధ్యాత్మికంగా ఎదగడానికి  మీరు మంచి సూచనలు ఇస్తారేమోనని వచ్చాను."

ఆయన అతని వంక ప్రసన్నంగా చూసి చెప్పాడు.

"నేను నీకు నాలుగు వస్తువులు ఇస్తాను. ఓచోట కూర్చుని వాటి గురించి ఆలోచించు. ఆవే నీకు రెండు చక్కని సూచనలు ఇస్తాయి."

ఆయన అటు ఇటు చూసి, పక్కనే ఉన్న తన కళ్ళ జోడుని, ఎదురుగా ఉన్న ఓ భక్తుడు సమర్పించిన ఓ అరటి పండుని, ఓ మల్లెమాలని, దేవుడు ముందున్న దీపాన్ని అతని చేతికి ఇచ్చాడు. ఆ సాధకుడు ఆ గదిలో ఓ మూల కూర్చుని ఒకోదాని గురించి దీర్ఘంగా ఆలోచించసాగాడు. అలా సాయంత్రం దాకా విశ్లేషించి, లేచి నవ్వు మొహంతో గురువు దగ్గరకి వెళ్ళి చెప్పాడు.

"మీ రెండు సూచనలు అర్థమయ్యాయి స్వామి."

"ఏమిటవి?" అడిగాడు గురువు.

"మనకి లాభం లేకపోయినా ఇతరులకి సహాయం చేయాలి. మనకి అపకారం చేసిన వారికి కూడా ఉపకారం చేయాలి. ."

"నిజమే. తేలిగ్గానే గ్రహించావు కాబట్టి వాటిని నువ్వు పాటిస్తే త్వరగా ఆధ్యాత్మిక ప్రగతిని పొందుతావు." దీవించాడు గురువు.

ఇదంతా గమనించిన ఆ గురువు శిష్యుల్లో ఒకడు అతను బయటకి రాగానే అతని దగ్గరకి వెళ్ళి అడిగాడు.

"మీరా వస్తువులని చూసి ఆ రెండు సూచనలని ఎలా అర్థం చేసుకున్నారో దయచేసి నాకు చెప్తారా?"

"అలాగే. మొదటగా కళ్ళజోడుని పరిశీలించి, దాని గురించి ఆలోచించాను. కంటిచూపు కోసం వాడే కళ్ళ జోడుని తమకే లాభం లేకపోయినా

ముక్కు చెవులు మోస్తున్నాయని గ్రహించాను. దాంతో నిస్వార్థంగా పరోపకారం చేయాలి అని ముక్కు చెవులు బోధిస్తున్నాయని అనుకున్నాను."

"మరి అరటి పండు, మల్లెమాల, దీపాలు?" ప్రశ్నించాడు శిష్యుడు.

"దాని మెడ విరిచి తోలు తీసినా అరటి పండు తియ్యటి పండుని నోటికి అందిస్తుంది. మాల కట్టడానికి సూదితో తన గుండెల్లో గుచ్చినా మల్లెపూలు తమ పరిమళాన్ని దాచుకోక అందిస్తున్నాయి. నిప్పుతో తన తలని అంటించినా దీపం చీకట్లని పారద్రోలి వెలుగుని ఇస్తోంది. ఈ మూడూ తమకి అపకారం చేసినవారికి కూడా ఉపకారం చేస్తూ నాకా రెండో సూచనని తెలియచేసాయి." వివరించాడు సాధకుడు.

## 3. మూడు రకాల మనుషులు

ఓ కొత్త ఊరికి వచ్చిన ముగ్గురు సన్యాసులు ఉదయం భిక్షాటన చేసి ఓ చెట్టు కింద కూర్చున్నారు. వారు తమకి లభించిన ఆహారాన్ని పంచుకుంటూ ఇలా మాట్లాడుకోసాగారు.

"నే వెళ్ళిన ఇంటి వాళ్ళంతా చెకుముకి రాయిలాంటి వారు." చెప్పాడు మొదటి సన్యాసి.

"నే వెళ్ళిన ఇంటి వాళ్ళు స్పాంజ్‌లాంటి వారు." చెప్పాడు రెండో సన్యాసి.

వెంటనే మూడోవాడు ఇలా చెప్పాడు.

"అదృష్టం. నే వెళ్ళిన ఇంటివాళ్ళు మాత్రం తేనె పట్టు లాంటి వారు కాబట్టి మనం ఈ పూట కడుపు నిండా తినగలుగుతున్నాం."

వాళ్ళ సంభాషణ విన్న గుడికి వచ్చిన ఒకడు ఆగి వాళ్ళని అడిగాడు.

"మీరు ఉపయోగించిన పదాలు దేనికో పోలికలని సూచిస్తున్నాయని మాత్రం నాకు అర్థమైంది తప్ప మొత్తం అర్థం కాలేదు. దయచేసి మీరు మాట్లాడుకున్నదేమిటో నాకు వివరిస్తారా?"

"అలాగే. దానం చేసే వారిలో మూడు రకాల వారుంటారు. కొందరు చెకుముకి రాయిలాంటి వారు. దాన్నించి ఏదైనా తీసుకోవాలనుకుంటే దాన్ని